క్లుప్తంగా

కుట్రదారులు, మోసగాళ్లకు బుద్ధి చెప్పండి



మహిళను ఓటు అడుగుతున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

పుట్టపర్తి: కుట్రదారులు, మోసగాళ్లను ఈ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం మండల కేంద్రమైన బుక్కపట్నంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మి, సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, మైనార్టీ మండల కన్వీనర్ కదీర్, ఎస్సీ కాలనీకి చెందిన నీలూరి ఈశ్వర్, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు ఓబిలేసు, పూలకుంట్ల నాగభూషణ, శీనా, డీలర్లు నాగభూషణ, బోసే గంగాధర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

టాపర్‌కు అభినందన



విద్యార్థిని గౌతమిని అభినందిస్తున్న కోటి సూర్యప్రకాష్‌బాబు దంపతులు

బత్తలపల్లి: ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 465 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన బత్తలపల్లికి చెందిన చెలిమి గౌతమిని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ దంపతులు ఆదివారం రాత్రి అభినందించారు. స్వీటు తినిపించి.. శాలువా కప్పి సత్కరించారు. రైతు బిడ్డ చదువులో రాణించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులకు అవసరమైన సహకారం అందిస్తామని గౌతమికి హామీ ఇచ్చారు.

సీతారామ కల్యాణోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్ శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 17న నిర్వహించే సీతారామ కల్యాణోత్సవం, 25వ వార్షికోత్సవానికి రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఎమ్మెల్యేను ఇంటి వద్ద కలిసి ఆహ్వానపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బద్దెల శ్రీనివాసులు, కమిటీ అధ్యక్షులు పామిశెట్టి క్రిష్టయ్య, ఉపాధ్యక్షులు చందా రామాంజనేయులు, పూజారి ఆదినారాయణ, కార్యదర్శి రంగన వెంకటరమణ, సహాయ కార్యదర్శులు పూజారి లక్ష్మీనారాయణ, పామిశెట్టి చిన్న శ్రీనివాసులు, కోశాధికారి నగ్రావుల రాముడు, సహాయ కోశాధికారి దాసరి హరికృష్ణ, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

గాండ్లపెంట: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రామానాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాతం జగన్మోహన్ అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధి హామీ ఏపీఓ మంజునాథ్ మాట్లాడుతూ ఉదయం 5.30 నుంచి 10.30 గంటల లోపల కూలీలు ఉపాధి పనులు పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంఈఓ కృష్ణానాయక్, వైద్యాధికారి మహేశ్వర మారుతి, సర్పంచ్‌లు, వైస్ ఎంపీపీ భారతి, ఎంపీటీసీ కమర్‌జహాన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు



డ్యాన్స్ చేస్తున్న కళాశాల విద్యార్థినులు

ధర్మవరం: ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని శ్రీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, అధ్యక్షుడు పోలా ప్రభాకర్, డైరెక్టర్లు బీఆర్ రంగనాథ్, బీవీ సుబ్బారావు, రమణ, అక్రమ్, ప్రిన్సిపాల్ ఫణికుమార్ తెలిపారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన డాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి.

రాజకీయాల్లో టీడీపీకి కాలం చెల్లింది

- ప్రజాదరణ ఓర్వలేకనే సీఎం జగన్‌పై హత్యాయత్నం
- ఎన్ని కుట్రలు చేసినా వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో 125 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

ధర్మవరం: అధికారం కోసం ఎంత నీచానికైనా దిగజారడం, కుట్రలు పన్నడం, దాడులకు పాల్పడటం వంటివి చేయిస్తున్న చంద్రబాబుకు, టీడీపీకి రాజకీయంగా కాలం చెల్లిందని, ప్రజాక్షేత్రంలో వారికి పరాభవం తప్పదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ బ్రహ్మయ్యాచారి, 35వ వార్డు కౌన్సిలర్ చింతా మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 125 కుటుంబాల వారు ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఎరుగని విధంగా సీఎం వైఎస్ జగన్ నవరత్నాలతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల ఆర్థిక పరిపుష్టికి కృషి చేశారన్నారు. విద్య, వైద్య రంగంలో 'నాడు – నేడు' ద్వారా ఆధునీకీకరించి మెరుగైన సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. అమ్మ ఒడి ద్వారా పిల్లల చదువులకు తోడుగా నిలిచారన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం ఉన్న ప్రతి కార్మికుడి కుటుబానికీ ఏడాదికి రూ.24 వేలు చొప్పున ఐదేళ్లపాటు రూ.1.20 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ సంక్షేమం, అభివృద్ధి ఆగకుండా ముందకెళ్లారన్నారు. దీన్ని ఓర్వలేని ప్రతిపక్ష నేత చంద్రబాబు రోజుకో నాటకం ఆడుతూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు. 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండటంతో ఎలాగైనా బ్రేక్ చేయాలన్న ఉద్దేశంతో టీడీపీ డైరెక్షన్‌లో సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగిందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి జనరంజక పాలనను అందిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, అత్తార్ జిలాన్‌బాషా, పెణుజూరు నాగరాజు, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్ బాషా, తోపుదుర్తి వెంకటరాముడు, వంట రమేష్, కొత్త శ్రీరాములు, చెన్నంపల్లి తిరుమల, తొండమాల రవి, సాధిక్, అమీర్‌బాషా, కాళంగి శ్రీన, కత్తె పెద్దన్న, దేవర సూరి పాల్గొన్నారు.



కౌన్సిలర్లు బ్రహ్మ, చింతా మారుతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన 125 కుటుంబాలు

గాండ్లపెంటలో టీడీపీకి గట్టి షాక్



సీఎస్ అబ్దుల్ రవూఫ్

గాండ్లపెంట: మండలంలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీలోని బలమైన నాయకులుగా ముద్రపడిన వారంతా వైఎస్సార్‌సీపీలోకి వచ్చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల రెండో తేదీన కురుమామిడి మాజీ సర్పంచ్ మాలే గంగాద్రి సీఎం జగన్ సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ కండువా వేసుకున్నారు. మరో సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ, జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు సీఎస్ అబ్దుల్ రవూఫ్ సోమవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈయనతో పాటు మరికొంతమంది టీడీపీ నాయకులు మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరనున్నారు. ఇది వరకే టీడీపీలో బలమైన నేతగా ఉన్న శ్రీకాంత్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరిన విషయం విదితమే. బలమైన సామాజిక వర్గానికి చెందిన గంగాద్రి, మైనార్టీ నాయకుడు అబ్దుల్‌రవూఫ్‌ల చేరికలతో వైఎస్సార్‌సీపీ మరింత పటిష్టం కానుంది.

నేడు కార్యకర్తల ఆత్మీయ సమావేశం

తనకల్లు: కొక్కంటిక్రాస్ సమీపంలో ఉన్న పోలం సిద్దారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరువుతారన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ



క్షతగాత్రుడు హరిప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి చికిత్స అనంతరం చెరువువాండ్లపల్లిలోని ఇళ్లకు చేరుకున్న హరిప్రసాద్, విశ్వనాథ్‌లను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సూర్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పారకల రమణ, కుళ్లాయినాయక్, యూత్ విభాగం మండల అధ్యక్షులు కోనపల్లి నరసింహారెడ్డి, ప్రతాప్‌నాయక్, వేణుగోపాల్‌రెడ్డి, సెంట్రింగ్ అంజి, ఇ.గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మృతునికి ఎమ్మెల్యే నివాళి

ఎద్దులవాండ్లపల్లి తండాకు చెందిన ఇస్లావత్ రమణానాయక్ (37) అనారోగ్యంతో ఆదివారం తిరుపతి ఆస్పత్రిలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం తండాకు వెళ్లి రమణానాయక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.


వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



మక్బూల్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం

తనకల్లు: టి.సదుం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు భారీ ఎత్తున సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు సుబహాన్, బాబ్‌జాన్, అక్బర్, శివారెడ్డి, రాము, మహమ్మద్, ఇంతియాజ్, నౌషాద్, షబ్బీర్, రహంతుల్లా, మంజునాథ్, శ్రీనివాసులు, హాసన్, ముబారక్, ముజీబ్, చెన్నారెడ్డి, రామయ్య, పీరాసాహెబ్, బాబా సాహెబ్, ఆంజనేయులు, కిష్టప్ప, వెంకటరమణ, నరసింహులు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, మనోహర్, అనిల్‌కుమార్, మహేష్, రామచంద్ర, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, తిమ్మరాజు, మునెప్ప, ఆనంద్, హరీష్, రేవంత్, రెడ్డెప్ప, మనోహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కదిరి ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మహిధర్‌రెడ్డి, బీసీ కన్వీనర్ మోహన్, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ కొండా మల్లికార్జున, సచివాలయ కన్వీనర్ రెడ్డిపీరా, నాయకులు రమణారెడ్డి శ్రీనివాసులు, మనోహర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి జననీరాజనం



బాలిరెడ్డిపల్లిలో ఓటర్లను అభ్యర్థిస్తున్న మక్బూల్ అహ్మద్

తలుపుల: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీకి జనాలు నీరాజనాలు పట్టారు. ఏ ఊరులో ఏ ఇంటికి వెళ్లినా జగనన్నకు మద్దతు తెలుపుతున్నారు. సంక్షేమ రాజ్యం కోసం వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటామన్నారు. కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ సోమవారం మండలంలోని లక్కసముద్రం, బట్రేపల్లి, కుర్లి పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి కుర్లి శివారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు.

బోస్ ముత్తాత స్వామికి ప్రత్యేక పూజలు

సిద్దుగూరిపల్లిలో వెలిసిన బోస్ ముత్తాత స్వామి తిరునాలలో ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, ఎంపీపీ రఫినాయక్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, శుభకర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు అరుణమ్మ, కొండారెడ్డి, దివాన్‌వలి, ఎంపీటీసీ క్రిష్ణ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన జగన్‌తోనే సాధ్యం



మోదుగులకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

తాడిమర్రి: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బంగారంపేట, మోదుగులకుంట గ్రామాల్లో సోమవారం ఆయన డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడిచిన ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని ఇంటింటికీ వివరించారు. పారదర్శక పాలన అందించడంతో పాటు ముంగిటకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చారన్నారు. సంక్షేమ రాజ్యం కోసం ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోమారు వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వర్థ, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, సచివాలయాల మండల కన్వీనర్లు మల్లప్పగారి మాధవరెడ్డి, అల్లే సాయినాథ్‌రెడ్డి, మారక శివారెడ్డి, సిద్దే రామకృష్ణారెడ్డి, సిద్దే ఆదిరెడ్డి, యువజన మండల కన్వీనర్ సిద్దే మోహన్‌రెడ్డి, ఆర్వేటి కాటమయ్య, సిద్దే రవీంద్రారెడ్డి, మారక శివానందరెడ్డి, మారక పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

కదిరి అర్బన్: మండల వ్యాప్తంగా 102 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సోమవారం ఎంపీడీఓ అంజనప్పకు అందజేశారు.

ఎన్‌పీకుంటలో 49 మంది

ఎన్‌పీకుంట: మండలంలోని వెలిచలమల, గౌకనపేట, మరికొమ్మదిన్నె, ధనియానిచెరువు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 49 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను అధికారులకు సమర్పించారు.

కదిరిలో 41 మంది..

కదిరి టౌన్: మున్సిపాలిటీలోని 8, 22 సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 41 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను అధికారులకు అందజేశారు.

ఉస్తినిపల్లిలో మరొకరు..

తనకల్లు: ఉస్తినిపల్లిలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఎం.అహ్మద్ తన ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డికి సోమవారం తన రాజీనామా పత్రాన్ని అందజేశారు.

ప్రకాష్ రెడ్డిని గెలిపించుకుంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగముని

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గం నుంచి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని వైఎస్సార్‌సీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, మండల కన్వీనర్ అమరనాథ్‌రెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్ విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్ష టీడీపీ నాయకులు గ్రామాల్లో కుటిల రాజకీయాలకు తెరతీస్తున్నారన్నారు. టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత ప్రజాబలం లేక ఇతర పార్టీల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేస్తోందని విమర్శించారు. కనగానపల్లిలో వైఎస్సార్‌సీపీలో ఉన్న కొన్ని వాల్మీకి కుటుంబాలను వారు ప్రలోభాలతో చేరదీసి గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. వాల్మీకులతో పాటు ఇతర బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలు వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్ర రాజకీయాలు చేసినా మేమంతా ఐక్యంగా ఉండి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కనగానపల్లి మండలం నుంచి వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ అందిస్తామని తెలిపారు. సమావేశంలో దృశ్యకళల స్టేట్ డైరక్టర్ ప్రభాకర్, పార్టీ నాయకులు పెద్దిరెడ్డి, చిన్నూరు రాము, అంకె గోపాల్, తిరుమలయ్య, లక్ష్మీనారాయణ, ఆలమూరప్ప, రమేష్, ముత్యాలు, చంద్రాయుడు, శ్రీరాములు, రవి, శ్రీకాంత్, కుళ్లాయప్ప, రాము, మల్లికార్జున, పోతలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సాధకుడు శ్రీధర్‌రెడ్డిని గెలిపించండి



కొండ్రవారిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

నల్లమాడ: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ఓటర్లను కోరారు. కొండ్రవారిపల్లి, సోమగుట్టపల్లి, పెద్దకోట్లపల్లి గ్రామాల్లో సోమవారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశీస్సులతో పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లాను సాధించడమే గాక పలు జాతీయ రహదారులను తీసుకొచ్చారన్నారు. రూ.864 కోట్లతో నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో దుద్దుకుంట రాజేశ్వరమ్మ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, ఎంపీటీసీ శివారెడ్డి, నాయకులు పెద్ద గంగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహిళా విభాగం మండల కన్వీనర్ చిన్నాదేవి, అమర్నాథరెడ్డి, తేజ్‌నాథ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, తప్పెట కిష్టప్ప, ఆదినారాయణ, జయరాం, గంగాధరం తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

కదిరి టౌన్: పట్టణంలోని 9, 10, 11 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను గెలిపించాలని కౌన్సిలర్లు ఇంటింటికీ తిరిగి అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాసిర్, నూరుల్లా, ఖాసీం, రాంప్రసాద్, కళ్యాణ్‌కుమార్, శంకర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం గశికవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అంకప్ప చంద్రశేఖర్, రామచంద్ర తదితరులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బలవంతంగా గత వారం టీడీపీ కండువాలు కప్పారు. వీరంతా సోమవారం సర్పంచ్ గోవిందరెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు.

చలివేంద్రం ఏర్పాటు

అమడగూరు: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయం వద్ద ఏపీఎం గోపాల్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వచ్చే వారికి వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు ఏపీఎం చెప్పారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం అర్బన్: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి రాజు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కళాజ్యోతి సర్కిల్‌లలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సిబ్బంది వాటర్ డెమో చేసి చూపించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్, కళాజ్యోతి సర్కిల్‌లలోని హోటళ్లు, దుకాణాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఎలా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

టీడీపీకి 30 బీసీ కుటుంబాలు గుడ్‌బై



వైఎస్సార్‌సీపీలో చేరిన బీసీలు

పుట్టపర్తి: పుట్టపర్తి పట్టణ పరిధిలోని ఎనుములపల్లిలో 30 బీసీ కుటుంబాలు టీడీపీకి గుడ్‌బై చెప్పాయి. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గణేష్, సాయి ప్రతాప్, ఓబిలేసు, నరేశ్, విజయ్, పవన్, గంగాద్రి, ఓబిలేసు, చెన్నప్ప, గంగిశెట్టి కుమారుడు గణేష్, రామాంజి, లక్ష్మయ్య కుమారుడు ఓబిలేసు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి శ్రీరామనవమి వేడుకలు

బత్తలపల్లి: పోట్లమర్రిలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 17న శ్రీరామనవమి వేడుకలు నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. మూడు రోజులపాటు సాగే వేడుకలు బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని ప్రధాన అర్చకులు కొమండూరు మారుతి ప్రసాద్, రమేష్, సాయికృష్ణ సోమవారం మీడియాకు తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. గురువారం వనభోజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. శుక్రవారం గ్రామంలోని నలలమ్మ ఆలయానికి ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

విఘాతం కలిగిస్తే చర్యలు

బత్తలపల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని డి.చెర్లోపల్లి, పత్యాపురం గ్రామాల్లో తమ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో గొడవలు, బెదిరింపులకు దిగడం ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్రమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు తిరుపాలు, సోమశేఖర్‌మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

అమడగూరు: మండలంలోని కొట్టువారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు జౌకలలో ప్రారంభమయ్యే ప్రచారం కొట్టువారిపల్లి, యర్రగుండువారిపల్లి, ఎగువ, దిగువ గువ్వలపల్లి, సానేవారిపల్లి, బాలప్పగారిపల్లి, కంచవాండ్లపల్లి మీదుగా జరుగుతుందన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

పుట్టపర్తి అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన మేరకు.. పుట్టపర్తి నుంచి బాలాజీ అనే వ్యక్తి స్వగ్రామం వెంగళమ్మచెరువుకు బైక్‌పై వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఈడిగి నీళ్ల రమణ అనే వ్యక్తి పుట్టపర్తికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గం మధ్యలోని కర్ణాటక నాగేపల్లి దాటిన తర్వాత కంకర మిషన్ సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్రవాహనం ఉన్నఫళంగా నెమ్మదించడంతో వెనకే వస్తున్న బాలాజీ ఎక్కడ ఢీకొంటాడోనని సడన్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న రమణ వేగాన్ని అదుపు చేయలేక ఢీకొన్నాడు. రమణ తలకు బలమైన గాయమవడంతో స్థానికులు వెంటనే సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఎస్పీని కలిసిన సీఐ

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లా నుంచి సీఐ తబ్రేజ్ శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీపై వచ్చారు. సోమవారం ఎస్పీ మాధవరెడ్డిని చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నీటి సమస్య రానీయొద్దు

నల్లమాడ: వేసవిలో మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ అధికారులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. తాగునీటి సరఫరా, పక్కాగృహాలు, వ్యవసాయం, ఉపాధి హామీ తదితర అంశాలపై చర్చించారు. వివిధ శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీ అమ్మవారి ఊరేగింపు

అమడగూరు: సోలుకుంట్లలో సోమవారం చౌడేశ్వరీ అమ్మవారిని ఊరేగించారు. పుర వీధుల గుండా ఊరేగించి గ్రామ నడిబొడ్డున కొలువుదీర్చారు. గ్రామస్తులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించే వారు అమ్మవారిని వారి ఇంటి ముంగిటకు తీసుకెళ్లి వడివేలు సమర్పించి కోర్కెలు తీర్చుకున్నారు. పూజల అనంతరం అమ్మవారిని మామిడి మాకులపల్లికి తరలించారు.

ఆదర్శ పాఠశాల హాల్‌టికెట్ల విడుదల

అమడగూరు: గాజుబండ సమీపంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నెల 21న పాఠశాలలో జరిగే ప్రవేశ పరీక్షకు అరగంట ముందుగానే రావాల్సి ఉంటుందన్నారు. ఏవైనా సందేహాలుంటే 81792 46022 నంబరులో సంప్రదించాలన్నారు.